క్లుప్తంగా

విద్యాబోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రుద్రంగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధనలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంఈవో ఎన్.రామకృష్ణ, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సమ్మిరెడ్డి, ఉపాధ్యాయుడు గడప వేణుకుమార్ ఉన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

ఎల్లారెడ్డిపేట: సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గొల్లపల్లి హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని అరుపుల మధుశాలిని ప్రతిభ చూపింది. రాజన్నపేటలోని శ్రీసత్యసాయి సేవామందిరంలో ట్రస్ట్ ఎండీ ఆర్‌జే రత్నాకర్ చేతులమీదుగా సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు.

వైకల్యంపై అవగాహన

వేములవాడరూరల్: అంతర్జాతీయ డౌన్ సిండ్రోమ్‌ను పురస్కరించుకొని శుక్రవారం భవిత కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, తల్లిదండ్రులకు వైకల్యంపై అవగాహన కల్పించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. విద్యాశాఖ అధికారి సతీశ్‌కుమార్, ఎంఈవో బన్నాజీ, స్కూల్ హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వీడియోలను వైరల్ చేస్తే చర్యలు

వేములవాడ: వేములవాడ దర్గాకు తాళం వేస్తున్నట్లు వస్తున్న వీడియో గతంలోనిదని, వీటికి సంబంధించిన వీడియోలను తిరిగి వైరల్ చేస్తే కఠిన చర్యలు తప్పవని టౌన్ సీఐ వీరప్రసాద్ శుక్రవారం హెచ్చరించారు. వేములవాడ రాజన్న ఆలయంలోని దర్గాకు తాళం వేస్తున్నట్లు వస్తున్న వీడియోలను కొంతమంది ఈ మధ్యే జరిగిందంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియో అవాస్తవమని, గతంలో జరిగినదాన్ని ప్రస్తుతం జరిగినట్టుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అర్హులందరికీ పింఛన్ అందించాలి

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు శివాజీ విమల కోరారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా అన్ని గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్మరి సంధ్య, పూజ, హేమ, కమ్మరి భాజవ్వ, శాంతవ్వ, డప్పుల చామంతి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిలకు అవకాశమివ్వాలి

బోయినపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రాజీవ్ యువ వికాసం పథకంలో రెడ్డి సామాజికవర్గం వారికి సైతం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బు తిరుపతిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

28న హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట: అనంతగిరి గ్రామ దేవాదాయ శాఖ పోచమ్మ దేవస్థానం హుండీ లెక్కింపు ఈనెల 28న లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి డీవీ మారుతీరావు శుక్రవారం తెలిపారు.

ఈతకెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దు

చందుర్తి: విద్యార్థులు వేసవి కాలం సెలవుల్లో సరదా కోసం చెరువులు, బావుల్లోకి వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలని కోరారు.

వాహనాల తనిఖీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలో ఎస్సై బి.రామ్మోహన్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. పలువురిపై కేసులు నమోదు చేశారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్వోసీ మంజూరు

తంగళ్లపల్లి: నేరెళ్ల గ్రామానికి చెందిన గొర్రె హర్షిత్ అనారోగ్యంతో బాధపడుతుండగా.. రూ.1.25లక్షల ఎల్వోసీని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరు చేశారు. విప్ ఆది శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

క్రీడలతో స్నేహభావం


మాట్లాడుతున్న వెంకటేశ్

వీర్నపల్లి: క్రీడలు యువతలో స్నేహభావాన్ని పెంపొందిస్తాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ అన్నారు. భగత్‌సింగ్ స్మారక విద్యార్థి, యువజనోత్సవాల సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు దినాకర్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలు ప్రారంభం


ఎల్లారెడ్డిపేటలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు


ఇల్లంతకుంట: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


కోనరావుపేట: విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు


బోయినపల్లి పరీక్ష కేంద్రంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్

జిల్లాలో పదోతరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


తంగళ్లపల్లి: నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


వీర్నపల్లి: తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు


రుద్రంగి: హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు


ముస్తాబాద్‌లో..



ఎల్లారెడ్డిపేట: దుమాల నుంచి అక్కపల్లి గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణంలో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించలేదు. నిర్మించిన వారం రోజుల్లోనే కాంట్రాక్టర్ పాటించిన నాణ్యత బయటపడింది. దుమాల గ్రామస్తులు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్‌కు చేసిన విజ్ఞప్తిని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుతం తారు రోడ్డు నిర్మాణంలో వాడిన కంకర, డాంబర్ తేలి మళ్లీ రోడ్డు కథ మొదటికొచ్చింది.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

పంట క్షేత్రాల సందర్శన


పంటల సాగు విధానం వివరిస్తున్న అంకాపూర్ రైతు నాయకులు

చందుర్తి: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని పంట క్షేత్రాలను చందుర్తి మండల రైతు సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం సందర్శించారు. వరి సాగుకు బదులు వాణిజ్య పంటలు సాగు చేస్తూ లాభాల పంటలు పండిస్తూ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిన అంకాపూర్ గ్రామంలోని రైతులను కలిసి ఏఏ పంటలు సాగు చేస్తున్నారు, సాగు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అత్యధికంగా మొక్కజొన్న, పసుపు, కూరగాయల సాగు చేస్తున్నట్లు అక్కడి రైతులు సాలే మోహన్‌రెడ్డి, రాజలింగం, గంగారెడ్డి, కిషోర్‌రెడ్డి వివరించారు. సాగు విధానంలో మెళకువలు పాటిస్తూ సేంద్రియ సాగుతో పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్నామని తెలిపారు. ఆరుతడి పంటల సాగులో డ్రిప్ పద్ధతితో నీటి తడులు అందిస్తున్నామని వివరించారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించి విత్తన తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. చందుర్తి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, ఉపాధ్యక్షుడు సంటి బాపురావు, రైతులు దుమ్ము అంజయ్య, పెగ్గర్ల రమేశ్‌రావు, పోతురాజు తిరుపతి, నలుమాచు రవీందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, లక్కర్సు మహేశ్ తదితరులున్నారు.

ఇఫ్తార్ విందు



వేములవాడ: రంజాన్ మాసం సందర్భంగా పట్టణంలోని పలు మసీదుల్లో శుక్రవారం ఇఫ్తార్ విందులు కొనసాగాయి. ఉపవాస దీక్ష విరమించిన అనంతరం సామూహికంగా భోజనాలు చేసి దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవాలు


మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తాడూర్ చౌరస్తాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ ప్రకటించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గుండు ప్రేమ్‌కుమార్, రమేశ్, లచ్చయ్య, మునిగె శంకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను నిలదీద్దాం


మాట్లాడుతున్న తోట ఆగయ్య

ముస్తాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ముస్తాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో సబ్బండ వర్గాలను ఏకం చేసిన కేసీఆర్.. అదే స్ఫూర్తితో బీఆర్‌ఎస్ 25 వసంతాల పండగను వరంగల్‌లో ఏర్పాటు చేశారన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, సర్వర్, కొమ్ము బాలయ్య, నర్సింహారెడ్డి, భరత్, మనోహర్, జహంగీర్, నల్లన ర్సయ్య, శీలం స్వామి, రాజు, నర్సింలు, శ్రీనివాస్, సత్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు


తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ముదిరాజ్ నాయకులు

తంగళ్లపల్లి: అసెంబ్లీ ముట్టడికి వెళ్తారనే సమాచారంతో మండలంలోని పలువురు ముదిరాజ్ నాయకులను శుక్రవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు కోడి అంతయ్య, మాజీ ఎంపీటీసీ కరికబోయిన కుంటయ్య, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు పసుల తిరుపతిని పోలీసులు అరెస్టు చేసి తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వేములవాడఅర్బన్: ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కల రాము, వేములవాడ టౌన్ ప్రెసిడెంట్ లాల దేవయ్య, బీసీ జాతీయ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డవేణి పర్శరాములును శుక్రవారం ఉదయం వేములవాడ పోలీసులు అరెస్ట్ చేశారు.

కార్మికుల అరెస్ట్ సరికాదు

వేములవాడఅర్బన్: గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్మికుల అక్రమ అరెస్టులను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు ఖండించారు. పట్టణంలో మాట్లాడుతూ.. ఎలాంటి ధర్నా, బంద్ పిలుపు లేకున్నా కార్మికులను ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదన్నారు.

ఆర్‌ఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లికి చెందిన పాతూరి ప్రవీణ్‌రెడ్డి ఆర్‌ఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికవగా.. స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రవీణ్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

బీసీ సంఘం అధ్యక్షుడికి..

వేములవాడఅర్బన్: జాతీయ బీసీ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన దండు వినోద్‌ను బీఆర్‌ఎస్ వేములవాడ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. అమరగొండ అజయ్, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, సందీప్, వెంకటసాయి, రాకేశ్, శివసాయి, రమేశ్, వంశీ తదితరులున్నారు.

సేవాభావం ప్రశంసనీయం


చలివేంద్రం ప్రారంభిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: ముస్తాబాద్ హనుమాన్ ట్రాలీ ఆటో యూనియన్ ఐదేళ్లుగా సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో హనుమాన్ ఆటో ట్రాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కేకే మహేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

భవన నిర్మాణం పూర్తి చేయాలి


పనులు పరిశీలిస్తున్న గోవర్ధన్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నిర్మిస్తున్న గౌడ సంఘం భవన నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న పనులను శుక్రవారం పరిశీలించారు. మండల సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కోల నారాయణగౌడ్ తదితరులున్నారు.

గురుకులాలపై నిర్లక్ష్యం వీడాలి


మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాలయాలపై నిర్లక్ష్యాన్ని వీడాలని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లోని నిర్వహించిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలోని గురుకుల హాస్టల్లో ఫుడ్ పాయిజన్‌తో 23 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. జిల్లా నాయకుడు మట్టె శ్రీనివాస్, నాయకులు ముగ్దం అనిల్‌గౌడ్, సమాల శ్రీకాంత్, గడ్డం రాకేశ్, కస్తూరి సాయి, అసిం, అక్రం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

సిరిసిల్లటౌన్: గురుకుల పాఠశాలలో విద్యార్థినిని కుక్క కరిచిన సంఘటనపై జిల్లా యంత్రాంగం ఇకనైనా తేరుకోవాలని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ కోరారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హాస్టల్ సందర్శనకు వెళ్లినపుడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తీరు సరిగా లేదన్నారు. మౌలిక వసతుల ఏర్పాట్లపై పరిశీలనకు వచ్చిన తమ పట్ల అగౌరవంగా ప్రవర్తించారని విమర్శించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, జిల్లా కార్యదర్శి దుంపెన స్రవంతి, పట్టణ అధ్యక్షురాలు వేముల వైశాలి, ఎల్లారెడ్డిపేట అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ, కోనరావుపేట అధ్యక్షురాలు తీగల జయశ్రీ, వేములవాడ టౌన్ అధ్యక్షురాలు వెల్తి రాధిక పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు


కలెక్టర్‌కు ఇచ్చిన దరఖాస్తు చూపుతున్న పోచయ్య

తంగళ్లపల్లి: తనను నాలుగేళ్లుగా అధికారులు వేధిస్తున్నారని, బిల్లులు చెల్లించకుండా మానసిక క్షోభకు గురిచేస్తున్నారని పద్మనగర్ గ్రామ మాజీ సర్పంచ్ ముడారి పోచయ్య ఆరోపించారు. 2021 సంవత్సరంలో గ్రామంలో ట్యాంకర్ల ద్వారా కాంటిన్జెంట్ వాటర్ సప్లయ్ అధికారుల అనుమతితో అందించానన్నారు. రూ.1.20లక్షలు బిల్లు రావాల్సి ఉండగా.. చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరుగుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి కలెక్టర్, ప్రస్తుత కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు.

ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట: మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మచ్చ రాజేశం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎలగందుల ప్రసాద్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ జమాల్, ఏఎంసీ డైరెక్టర్లు తిరుపతిగౌడ్, వీరేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై అవగాహన


మాట్లాడుతున్న అన్నపూర్ణ

వీర్నపల్లి: ఒకే దేశం.. ఒకే ఎన్నిక కార్యక్రమంపై మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ లక్పతినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజన్న సిరిసిల్ల మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ హాజరయ్యారు. మహిళలు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, జిల్లా సెక్రటరీ దుంపెన స్రవంతి, ముస్తాబాద్ మండల అధ్యక్షురాలు మహేశ్వరి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ, వేములవాడ టౌన్ అధ్యక్షురాలు వెల్ది రాధిక, సిరిసిల్ల టౌన్ మహిళా కార్యకర్త కర్నే హరీశ, ఉపాధ్యక్షులు మాడుగుల లింబద్రి, బట్టు పిరియా, బండారి మహేశ్, మాలత్ ప్రకాశ్, బానోత్ తిరుపతి, అజ్మీర తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: బీజేపీ వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ ఆధ్వర్యంలో మండల శాఖ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక కోసం సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఎర్రం మహేశ్, అడేపు రవీందర్, శంకర్, జింక శ్రీనివాస్, రమేశ్, సంజీవరెడ్డి, విశ్వనాథం తదితరులున్నారు.

వీర్నపల్లిలో పోషణ్ మేళా


పోషణ్ మేళా కార్యక్రమంలో మహిళలు

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోషణ్ మేళా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సూక్ష్మ పోషకాల్లో భాగంలో అయోడిన్ లోపం ద్వారా యుక్త వయస్సు మహిళల్లో థైరాయిడ్, గాయిటర్ వంటి రుగ్మతలు వస్తాయని, పిల్లల్లో మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందని, అయోడిన్ ఉన్న ఆహార పదార్థాలు, పాలు, పాల పదార్థాలు, అయోడైజ్ ఉప్పు, చేపలు, రొయ్యలు, కూరగాయలు, నాణ్యమైన పౌష్టిక ఆహారం తీసుకోవాలన్నారు. అయోడిన్, పోషకాహారంపై ఆటల పోటీలు, క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, మండల కోఆర్డినేటర్లు రమ్య, బాబు, తిరుపతి, లక్ష్మణ్, మోడల్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వైద్యశిబిరం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య బృందం

వేములవాడరూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి పీసీవోడీ, రక్తహీనత తదితర అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్యులు స్వప్న, లత, మధు, ప్రవచని, సాయివైష్ణవి, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఝాన్సీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

బాడీ మాస్ ఇండెక్స్‌పై అవగాహన


విద్యార్థి బరువు ➤ చూస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో బాడీ మాస్ ఇండెక్స్‌పై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఎత్తు, బరువు తీసుకొని బాడీ మాస్ ఇండెక్స్ కనుక్కోవడం జరిగిందన్నారు. వారి బబేసీటి లెవల్స్, ఎవరైనా అధిక బరువుంటే బరువు తగ్గించుకోవడానికి అవకాశముంటుందని అన్నారు. సరైన బరువు లేకపోతే అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందన్నారు. అధ్యాపకులు ప్రసాద్, కరుణ, శ్రీధర్‌రావు, గోపి, అర్జున్ తదితరులున్నారు.

డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీనియర్ సిటిజన్స్

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేకంగా డే కేర్ సెంటర్ ఏర్పాటుకు సహకరించాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ శుక్రవారం విన్నవించింది. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జనపాల శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాస్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆర్థిక సాయం



రుద్రంగి: రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద తోటి మిత్రుడి చికిత్సకు ఆర్థిక సాయం చేసి చిన్ననాటి మిత్రులు ఔదార్యం చాటుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పడాల శ్యాం అనే వ్యక్తి వారం రోజుల క్రితం ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న 2003–04 పదోతరగతి స్నేహితులు శ్యాంకు అండగా నిలిచారు. రూ.50వేలు జమ చేసి అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్: నామాపూర్‌లో రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేశామని ఎస్సై గణేశ్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై రేషన్ బియ్యం సేకరిస్తున్న అనరాశి మల్లయ్య వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించామన్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఎల్లారెడ్డిపేట: రాచర్లగొల్లపల్లిలో ఓ ఇంట్లో పేకాట స్థావరంపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలిసి పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.30వేల నగదుతోపాటు 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.